

సమష్టి కార్యాచరణతో ఎల్ నినో ఎదుర్కొందాం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 31 అక్టోబరు , 2026 | పేజీలు : 7

ఎంపిఎల్ పరిశ్రమ నుంచి
బ్లాక్ డస్ట్ కలకలం

చిట్యాల పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకూ కాలుష్య భయాలు
ప్రజల్లో ఆందోళన... గాలి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు ఎప్పుడు?



ప్రజాపక్షం/చిట్యాలఃు నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి ఆనుకుని మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో నెలకొని ఉన్న ఎంపిఎల్ ఐరన్ పరిశ్రమ నుంచి వెలువడుతోందని స్థానికులు ఆరోపిస్తున్న నల్లటి ధూళి (బ్లాక్ డస్ట్) సమస్య చిట్యాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలల్లోనూ ఆందోలనకు కారణమ వుతోంది. రాత్రి వేళల్లో పరిశ్రమ నుంచి నల్లటి ధూళి వెలువడు తోందని, ఉదయం వేళల్లో రోడ్లు, ఇళ్ల పరిసరాలు, బహిరంగ ప్రదేశాలపూ నల్లటి మసి కనిపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్య కేవలం ఒక కానీకి మాత్రమే పరిమితమైందా.. లేక పరిసర ప్రాంతాలపూ కూడా ప్రభావం చూపుతోందా అన్నది అధికారులు శాస్త్రీయంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. చిట్యాల పట్టణంతో పాలు పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న వట్టిమర్తి, గాదిరెడ్డిపల్లె, శాంతోటబావి, నేరడ నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయిపల్లి తదితర గ్రామాల ప్రజలపైనా ఈ ధూళి ప్రభావం పడుతుంది.

రాత్రివేళల్లో వెలువడుతున్న నల్లటి ధూళిఃు స్థానికుల వాదన ప్రకారం రాత్రి వేళల్లో పరిశ్రమ నుండి నల్లటి ధూళి వెలువడుతున్నట్లు కనిపిస్తోంది. ఉదయం సమయానికి పరిసర ప్రాంతాల్లో నల్లటి మసి పేరుకుపోతున్నట్లు గుర్తిస్తున్నామని చెబుతున్నారు. కాలనీలు, ఇళ్ల ముందు ప్రదేశాలు మురికిగా మారుతున్నాయి. నిత్య జీవితంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపో తున్నారు. పరిశ్రమ ధూళి గాలి ద్వారా ఎంత దూరం ప్రయాణిస్తోంది? గాలి దిశను బట్టి ఏయే గ్రామాలపై ప్రభావం పడే అవకాశం ఉంది? ధూళిలో సాధారణ కణాలే ఉన్నాయా లేక హానికరమైన పదార్థాలు కూడా ఉన్నాయ? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. ఇందుకోసం ఫ్యాక్టరీ పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లోనూ గాలి, ధూళి నమూనాలను సేకరించి పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలుష్య నియంత్రణ మండలి స్పందించాలిఃు తెలంగాణ కాలుష్య మండలి అధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించాలన్న డిమాండ్‌ను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపల్, రెవిన్యూ, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు కూడా చొరవ తీసుకోవాలి. ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న ఉద్గారాలు నిర్ధేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? ధూళి నియంత్రణకు అవసరమైన చర్యలు అమలౌతున్నాయా? అనే అంశాలను కాలుష్య మండలి అధికారులు నిర్ధారించాల్సిన అవసంర ఉంది. నిబంధనలు ఉల్లంఘటన జరిగితే పరిశ్రమపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యంఃు ఎంపిఎల్ పరిశ్రమ నుంచి వెలువడుతోందని ఆరోపిస్తున్న బ్లాక్ డస్ట్ సమస్యపై సంబంధిత యంత్రాంగం తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. గాలి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు, ప్రజారోగ్యంపై అవసరమైన వైద్య పరమైన పరిశీలనలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజప్తి చేస్తున్నారు. సమస్యకు మూలకారణాన్ని గుర్తించి ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు భరోసా కల్పించే శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు.



బియ్యం ధరలు తగ్గించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి
జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రైస్ మిల్లర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి బియ్యం ధరలను తగ్గించి విక్రయించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో ఉన్న దాక్షాయిని పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లు ప్రాంగణంలో బియ్యం మిల్లింగ్ విధానం, ప్యాకింగ్, రవాణా ప్రక్రియతో పాటు నాణ్యతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి బాబి, మిల్లు నిర్వాహకులు జేవి రమణ, తిరుపతిరావులతో ఆయన సమావేశమయ్యారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రజలు ఆర్థికంగా, ఇతరత్రా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇలాంటి సమయంలో బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించకుండా తగ్గించి అమ్మాలని, నాణ్యమైన బియ్యం మాత్రమే మార్కెట్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బియ్యం బస్తాల తూకం, ఖాళీ సంచుల నిల్వలు, లేబుళ్లు, ధరల పట్టికలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, డిఎస్ఓ వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో లీగల్ మెట్రాలజీ తనిఖీలు.. 8 కేసులు నమోదు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని రైస్ మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 8 కేసులు నమోదు చేశారు. శుక్రవారం అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, నల్గొండ పర్యవేక్షణలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాసులు ఈ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని 5 రైస్ మిల్లులు, 3 రిటైల్ బియ్యం విక్రయ దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 8 ఉల్లంఘనలు గుర్తించి కేసులు నమోదు చేశారు. వీటిలో రైస్ మిల్లులపై 5 కేసులు, రిటైల్ బియ్యం దుకాణాలపై 3 కేసులు ఉన్నాయి.ఈ సందర్భంగా అధికారులు వినియోగదారులకు పలు సూచనలు చేశారు. బియ్యం కొనుగోలు సమయంలో బస్తాపై ప్రకటించిన నికర బరువును తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. బియ్యం బస్తాను తూకం వేయించి అసలు బరువును నిర్ధారించుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పట్టభద్రుల ఓటర్ నమోదుకు నవంబర్ 6 చివరితేదీ
ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణిత గడువులోగా ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రానున్న శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు వెల్లడించారు.

మూడేండ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలి

2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఇందుకోసం ఫారం18 సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు

పట్టభద్రుల తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వైబ్‌సెట్ https://ceotelangan.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఫారం18 ను విద్యార్హత దృవపత్రాలతో జతచేసి సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి, నియమిత అధికారి కార్యాలయంలో అందజేయవచ్చని అన్నారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపే అవకాశం ఉందని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఏ విధానంలో దరఖాస్తు చేసిన విద్యార్హత దృవపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు.

అర్హులందరూ నమోదు చేసుకోవాలి

జిల్లాలో అర్హత కలిగిన పట్టభద్రులెవరూ ఓటర్ నమోదుకు దూరం కావోద్దని కలెక్టర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, పట్టభద్రుల సంఘాలు, విద్యా సంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు ఓటర్ నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తులతో వచ్చిన విద్యార్హత దృవపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హతమైన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి దృవీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఓటర్ నమోదు ప్రక్రీయపై సందేహాలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు ఆదర్శం ఓంకార్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాజకీయాలంటే పదవులు, అధికారాలు, ఆస్తులు కూడబెట్టుకోవడం కాదని, ప్రజల కోసం బతకడం, వారి హక్కుల కోసం పోరాటం చేయడమేనని నిరూపించిన అరుదైన ప్రజా నాయకుడు మద్దికాయల ఓంకార్ అని ఎంసీపీ ఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, సైదమ్మ కొనియాడారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంసీపీఐయూ , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోతు గంటి కాశి అధ్యక్షతన మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు మోహన్ నాయక్, భరత్, ఆశీర్వాదం, కిరణ్, జ్యోతి, హరీష్, నాగయ్య, శ్రీను, ఇమ్మానుయేల్, లక్ష్మణ్, సైదమ్మ, రాములమ్మ, కరుణ, శివ, సుశీల పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఎటొనినో ప్రభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు మండలాల గుర్తింపు సంఖ్యను పెంచడంతో పాటు సాగుపై ఆధారపడ్డ రైతులను, ఉపాధి కోల్పోయే రైతు కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని కోరారు. పంట సాగు చేయని రైతులకు పరిహారం కింద ఎకరాకు రూ.20 వేల చొప్పున నగదు సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంధం శ్రీనివాస్, మాజీ నల్లగొండ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి.జానిమియా, మైనార్టీ సెల్ పార్లమెంట్ కోశాధికారి షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వేళలో సన్మాన సభలా..

ప్రజాపక్షం/నేరేడుగొమ్ము; నేరేడుగొమ్ము విద్యాధికారి తాటికొండ బ్రహ్మాచారి పాఠశాలలో బోధన సమయాలలో సన్మాన సభలు నిర్వహిస్తూ పాఠశాల ఉపాధ్యాయులపై బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు అని రైట్ టూ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సొసైటీ ఫౌండర్ జాతీయ అధ్యక్షులు కే. బాబురామ్ నాయక్ అన్నారు. ప్రాథమిక పాఠశాల నుండి ఉన్నత పాఠశాల నుండి కొంత డబ్బులను వసూళు చేస్తున్నారు అని దీనిపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టాలని ఆయన కోరారు. మోడల్ పాఠశాల నుండి బియ్యం, కస్తూర్బా పాఠశాల నుండి చికెన్ సేకరిస్తున్నారని దానిపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం



ప్రజాపక్షం/చందంపేట; రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలం పోలేపల్లి రైతు వేదికలో రైతులకు 100 శాతం సబ్సిడితో ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వం 700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఉచితంగా అందిస్తోందని, సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరి సాగుకు బదులుగా వేరుశనగ వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 90 బోర్లు ఎండిపోయాయని, ముఖ్యంగా చందంపేట మండలంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏవో లక్ష్మతి, మల్లారెడ్డి, గోవింద్, రాజేందర్‌రెడ్డి, హరికృష్ణ, పాపానాయక్, భరత్, మున్నయ్య, మండల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డులలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్కాది అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డు నిత్యా తండాలో ఐదు లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో నిర్మాణం చేయనున్న సిసి డ్రైన్ కు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో 4వ వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయి నిర్మాణం జరుగుతున్నాని చెప్పారు. అదే వార్డులో బోర్‌వెల్‌తో పాటు పైపులైన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అధికార ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, మున్సిపాలిటి సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భుక్యా జ్యోతి, లింగనాయక్, ఎతా తిరుమలయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రముఖులు, వాజీద్‌మియా, సలీం ఆప్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలునాయక్ పాల్గొన్నారు.

ఎకరాకు 30వేలు నష్టపరిహారం ఇవ్వాలి



ప్రజాపక్షం/చివ్వెంల: కరువు పరిస్థితుల్లో వరి పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులుమల్లు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలో ఎండిపోయిన వరి పంటలను సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు నీరు లేక ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులు చేతికొచ్చే సమయంలో ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఎండిపోయిన వరి పంటలకు తక్షణమే పంట నష్టం అంచనా వేసి ఎకరాకు 30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించి కరువు సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సైదులు, కందాల శంకర్‌రెడ్డి, దండ వెంకటరెడ్డి, కొప్పుల రజిత, పిండిగా నాగయ్య, ఇట్టిమళ్ల స్టాలిన్, బొప్పాని సులేమాన్ పాల్గొన్నారు.

ఎపికి మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ సహాయక బృందాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తుఫాన్ కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించడానికి తెలంగాణ విద్యుత్ సంస్థ సహాయక బృందాలను పంపిందని మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌చారి తెలిపారు. శుక్రవారం టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశాల మేరకు, నల్గొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో మిర్యాలగూడ డివిజన్ నుండి ప్రత్యేక నిపుణుల బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఉన్నతాధికారులు జెండా ఊపి ప్రత్యేక సహాయక బృందాల వాహనాలను తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు సాగనంపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏడీఈలు తిరుపతయ్య, కోడిరెక్క రవికుమార్, ఇందిరా, ఏఈలు వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జానయ్య, కృష్ణారెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు మారం శ్రీనివాస్, వీరభద్రం, ఎల్లయ్య చారి, బిక్షం, జలంధర్, భాస్కర్, సతీష్, వెంకటరత్నం, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

ప్రజాపక్షం/తుంగతుర్తి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని రాష్ట్రంలో పాలన పడకేసిందని విమర్శించారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌లో బాగంగా 2023 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేయించుకోవాలని తెలిపారు. 2028 ఎన్నికల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు యుగందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, నంకేపల్లి రఘునందన్‌రెడ్డి, ఎస్ఎ రజాక్, మల్లయ్య పాల్గొన్నారు.

అఖిలభారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



ప్రజాపక్షం/మునగాల: అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన మండల కమిటి సమావేశంలో చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్లగొండ లో జరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభల సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల గడ్డ మునగాల పరగణం, రైతు సంఘం జాతీయ మహాసభలకు ఈ మండలం నుండి రైతు సంఘం అధ్వర్యంలో సుమారు రెండువేల మందిని సమీకరించి విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 5 నుంచి డప్పులు దళాలతో, కోలాటం బృందాలతో కళాకారులతో వాడవాడ నా పల్లె పల్లెన మహాసభలపై ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జూలకంటి విజయలక్ష్మి , షేక్ సైదా, బచ్చల కూర స్వరాజ్యం, మండవ వెంకటాద్రి, స్టాలిన్‌రెడ్డి, జ్యోతి, సైదులు, మల్లారెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి, బ్రహ్మం పాల్గొన్నారు.

ధాన్యం రవాణాపై రైతులపై కేసులు పెట్టవద్దు

ప్రజాపక్షం/నేరేడుచర్ల: ధాన్యం రవాణాపై రైతులపై కేసులు నమోదు చేయవద్దని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో రైతులతో కలిసి మాట్లాడుతూ ఇప్పటికే ఆకాల వర్షాలు, తుఫాన్ ప్రభావం, విద్యుత్ కోతలు, గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దళారుల కారణంగా ధాన్యం ధర క్వింటాలకు ఐదువేల నుంచి 3500/4000 వేల వరకు పడిపోయి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం మిల్లులకు తరలిస్తున్న రైతులపై ఓవర్‌లోడ్, వాహనపత్రాల పేరుతో ఆర్టివో అధికారులు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. అధికారులు మానవతా దృక్పదంతో వ్యవహరించి రైతులకు వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా అండగా నిలవాలని కోరారు. తక్కెళ్ల నాగార్జున, షేక్ నాగులమీరా, అరె శ్రీకాంత్, సైదానాయక్, పత్తిపాక రమేష్, అమరవరపు సతీష్, గౌతమ్ పాల్గొన్నారు.



కట్టంగూర్ ఎస్ఐగా క్రాంతికుమార్



ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్): పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా క్రాంతికుమార్ బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు విధులు నిర్వహించిన మునుగోటి రవీందర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో క్రాంతికుమార్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఉద్యోగానికి వీడ్కోలు.. సేవలకు అభినందనలు



ప్రజాపక్షం/నకిరేకల్: మండలంలోని నోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయురాలు ముస్కు కవిత పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఈసందర్భంగా వీరేశం మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యారంగానికి కవిత అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,చల్మారాజు,నాయకులు గాదగోని కొండయ్య కొండయ్య,లింగాల వెంకన్న,యాస కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/చింతపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ముందుగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు నట్ప గిరిధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని గిరిధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా గిరిధర్ హాజరయి మాట్లాడుతూ గ్రామాల్లో పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహనతో పాటు ఓటరు నమోదుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగంపల్లి భాస్కర్, కొలుకులపల్లి కొండల్, నల్ల శంకర్, ఎండి ఫయాజ్, సిద్ధే స్వామి, సల్మాన్ పాల్గొన్నారు.



మేకల దొంగల అరెస్ట్...

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పరిధిలోని రామారం గ్రామ శివారులో ఈనెల 28వ తేదిన గ్రామానికి చెందిన ముక్కెర లింగయ్యకు చెందిన మేకల కొట్టం నుండి మేకలు దొంగతనానికి గురయ్యాయని లింగయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన గుండాల పోలీసులు రెండు రోజుల్లోనే నిందితులను పట్టుకొని కేసును చేధించారు. శుక్రవారం గుండాల ఎస్ఐ సైదులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితులు పాలదుగు మణితేజ, మర్రికుక్కల నాగరాజు, చాపల సాయికుమార్, పసుగంటి దుర్గాప్రసాద్, చింతపల్లి రాకేష్‌లు ఒక ముఠాగా ఏర్పడి నార్కట్‌పల్లి హరిబాబుతో కలిసి మేకలను దొంగతనం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఈనెల 28వ తేది రాత్రి ఈ ఆరుగురు కలిసి సెల్ఫ్‌డ్రైవ్ కారును అద్దెకు తీసుకొని అందులో రామారం గ్రామ శివారులో గల మేకల కొట్టంలోకి ప్రవేశించి ఐదు మేకలను దొంగిలించి తీసుకువెళ్లారు తెలిపారు. నిందితుల వద్ద నుండి నాలుగు మేకలను స్వాధీనం చేసుకున్నామని నిందితుల్లో నార్కట్‌పల్లి హరిబాబు పరారీలో ఉన్నట్లు, త్వరలోనే ఆ నిందితున్ని కూడా అదుపులోకి తీసుకుంటామని ఎస్ఐ సైదులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్‌ను తొలగించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పేదలకు చేరాల్సిన పౌర సరఫరాల రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తూ విక్రయించుకుంటున్న డీలర్‌ను వెంటనే పదవి నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ ధీరావత్ శ్రీనునాయక్ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణ పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను ఆయన నేరుగా కలుసుకుని తేట్టకుంట గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న తీవ్రమైన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర వివరాలను సమర్పించారు. దామరచర్ల మండల పరిధిలోని తేట్టకుంట గ్రామానికి చెందిన డీలర్ పేద ప్రజలకు సక్రమంగా సరుకులు అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు అందాల్సిన సన్నబియ్యాన్ని సకాలంలో ఇవ్వకుండా అక్రమ మార్గాల్లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు.రేషన్ బియ్యం కోసం షాపు వద్దకు వచ్చే నిరుపేద మహిళలు, వయోవృద్ధుల పట్ల సదరు డీలర్ భర్త అత్యంత నిర్లక్ష్యంగా, దుర్భాషలాడుతూ ప్రవర్తిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఓట్లు వేసినంత మాత్రాన బియ్యం ఇవ్వాలా అంటూ బెదిరింపులకు దిగుతున్నారని, భార్య పేరిట డీలర్‌షిప్ ఉంటే భర్త అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ స్పందిస్తూ విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారణ అయితే డీలర్‌ను శాశ్వతంగా తొలగించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాధితులు, స్థానిక ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం రైతు ఉద్యమాలు వేగవంతం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గొప్ప చరిత్ర ఉందని, ఆ పోరాట స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి బ్రిటీష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమ నమూనాలోనే, నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై హక్కుల సాధన కోసం రైతాంగం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలకు నిరసనగా, భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా జరిగిన ఉద్యమాల్లో కర్షకుల పాత్ర అత్యంత కీలకమైనదని వివరించారు.ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరులో రూపం మాత్రమే మారిందని, సారం మాత్రం మారలేదని మండిపడ్డారు. వచ్చే నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యే ఏఐకేఎస్ జాతీయ సభలను జిల్లా రైతాంగం, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, బొచ్చు కోటిరెడ్డి, రవినాయక్, చౌగాని సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నిరుద్యోగులు, అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నవంబర్ 29న నిర్వహించ తలపెట్టిన సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమ్స్ పరీక్షలను వాయిదా వేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఉన్న పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అధికారులకు ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒకే రోజు రెండు కీలకమైన జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.నవంబర్ 29న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌తో పాటు అదే రోజు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎస్ఐ పరీక్షను కూడా ఖరారు చేయడంతో వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు తీవ్రంగా



నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ రెండు పరీక్షలకు అర్హత కలిగిన అనేకమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఒకే రోజు రెండు పరీక్షలు ఉండటంతో ఏదో ఒక పరీక్షను రాసే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు జి. రవికిరణ్, శ్రీకాంత్, అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి గుత్తా నివాళులు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నాణ్యమైన స్వీట్స్ అందిస్తూ పట్టణ ప్రజల అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.పట్టణంలోని పుల్లారెడ్డి స్వీట్ హౌస్ యజమాని బండ శ్రీనివాస్ రెడ్డి దశదినకర్మ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్ రెడ్డి,నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీధర్ రెడ్డి,ఖయ్యూం బేగ్ హాజరై శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా పుల్లారెడ్డి స్వీట్ హౌస్ ద్వారా ప్రజలకు సేవలందించారని,ఆయన మరణం కుటుంబానికి, పట్టణ ప్రజలకు తీరని లోటని అన్నారు.కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బండ వెంకటరెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి,సోమేశ్వర్ రెడ్డి,కట్టా శంభిరెడ్డి,ప్రభావతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరును కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : కట్టంగూరు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు కట్టంగూరు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూనల్గొండ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటాయని,విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు,సీనియర్ నాయకుడు గుండాల మల్లేష్‌గౌడ్, చిట్యాల రాజిరెడ్డి,మాజీ సర్పంచ్ ముప్పిడి యాదయ్య,చెరుకు వెంకటాద్రి,పాదూరు శశిపాల్‌రెడ్డి,రేకల రాజు,ఊట్కూరు నాగయ్య, నిమ్మనగోటి శివ, తదితరులు పాల్గొన్నారు.

చండూరు మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాపక్షం/చండూరుః మున్సిపాలిటీలో ప్రరిశుభ్రతకు పాధాన్యత నిచ్చే దుకాణాలను ,రెస్టారెంట్లనే ప్రోత్సహించాలని చండూరు పట్టణాన్ని పరిశుభ్రమైన ఆరోగ్యవంతమైన ,ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమీషనర్ మల్లేశం అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో చికెన్ షాపులు , రెస్టారెంట్లు ,సూపర్ మార్కెట్లు ను మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు షాపులకు మొత్తం 10వేల రూపాయల జరిమాన విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మల్లేశం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. చికెన్ షాపులు , సూపర్ మార్కెట్‌లు , రెస్టారెంట్ల యాజమాన్యాలు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాములు , వార్డ్ ఆఫీసర్ శ్రీరాములు , పర్యావరణ ఇంజనీర్ అరవింద్ రెడ్డి , మహేష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

ప్రజాపక్షం/గుండాల; యాద్రాది భువనగిరి జిల్లా గుండాల మండలం, పాచిళ్ల గ్రామాలలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లకు గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసె లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ పార్టీ యొక్క ముఖ్య లక్ష్యం అని ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, వారి ఇంటి నిర్మాణం చేసి, వారు గృహప్రవేశాలకు వెళ్లే వరకు కాంగ్రెస్ పార్టీనే బాధ్యత తీసుకుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకన్న, సర్పంచులు ఐలయ్య, మహేష్, మంజుల, ఉప సర్పంచ్ సాయి, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ప్రజాపక్షం/చండూరుః మండల పరిధిలోని పడమటి తాళ్ల గ్రామంలో జరుతున్న మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను శుక్రవారం స్థానిక ఎంపిడిఓ బండారు యాదగిరి సర్పంచ్ గాలెంక రాంబాబు తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ కూలీలకు కల్పిస్తున్న మౌళిక సదుపాయాలు , పనుల పురోగతి, పనుల నాణ్యత పై అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని ,కూలీలందరికి జాబ్ కార్డుల ఆధారంగా పనిదినాలు కల్పించి సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ ఏరుకొండ కోటయ్య , ఉప సర్పంచ్ జిల్లా సత్తయ్య , పంచాయితీ కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాపక్షం/కోదాడరూరల్: గుడిబండ గ్రామ పంచాయతీని కోదాడ డిఎల్‌పివో పార్థసారథి సందర్శించి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి వ్యక్తిగత అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్‌కు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ మందుల నాగయ్య, పంచాయతీ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, ఉప సర్పంచ్ జయసింహారెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కరువు నివారణకు 12 నెలల వేతనం అంకితం



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎల్ నినో ప్రతికూల ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర కరువు సమస్యల నుంచి ఉపశమనం కలిగించేందుకు తన వంతుగా 12 నెలల శాసనసభ్యుడి వేతనాన్ని ప్రజా సేవకు కేటాయిస్తున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. శుక్రవారం కరువు నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సమక్షంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో తమ బిఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ఏడాది పాటు తన పూర్తి వేతనాన్ని ప్రజాసేవా కార్యక్రమాలకే అంకితం చేస్తున్నట్లు తెలిపారు.తాను రాజకీయాలకు అతీతంగా కేవలం ప్రజా సేవకుడిగానే, ప్రజల్లో ఒకడిగా ఉంటానని స్పష్టం చేశారు. ఎలాంటి కష్టకాలంలోనైనా మిర్యాలగూడ నియోజకవర్గాన్ని, తనను నమ్ముకున్న ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తరఫున అమలయ్యే సంక్షేమ పథకాలను ప్రజలకు పక్కాగా అందుబాటులోకి తెస్తూనే, తమ బిఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా విస్తృతమైన సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బిఎల్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, పౌర ప్రముఖులు పాల్గొన్నారు.

అధునాతన చికిత్సతో యువతి ప్రాణాలు కాపాడిన యశోదా ఆసుపత్రి వైద్యులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :20 ఏళ్ల యువతికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అధునాతన చికిత్స చేసి ప్రాణహాని నుంచి కాపాడినట్లు కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ తెలిపారు.శుక్రవారం పట్టణంలోని శాలినీ రెస్టారెంట్ సమావేశపు హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండకు చెందిన 20 ఏళ్ల యువతికి అకస్మాత్తుగా మాట కోల్పోవడం,కుడివైపు చేయి,కాలు కదలకపోవడంతో హైదరాబాద్ మలక్‌పేటలోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు.బ్రెయిన్‌లో 5 మిల్లీమీటర్ల మిడ్‌లైన్ షిఫ్ట్,తీవ్రమైన పాటాషియం లోపంతో సంక్లిష్ట పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.బ్రెయిన్ స్కానింగ్‌లో ఎడమ యాంటీరియర్ సెరిబ్రల్ ఆర్టరీ (ఏసీఏ) పరిధిలో అక్యూట్ ఇస్కీమిక్ స్ట్రోక్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, ఎడమ పారాసాజిటల్ ఫ్రంటోపారియటల్ ప్రాంతంలో ఇన్‌ఫార్క్ట్ ఏర్పడి,మాస్ ఎఫక్ట్ కారణంగా మెదడు మధ్యరేఖ కుడివైపునకు 5 మిల్లీమీటర్లు జరిగినట్లు గుర్తించి న్యూరో సర్జన్ పరీక్షల అనంతరం బ్రెయిన్ సర్జరీ అవసరం లేకుండా కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్‌మెంట్ కొనసాగించామన్నారు.కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జయాదిత్య ఘోష్, న్యూరో సర్జన్ డాక్టర్ బి.గీయానంద్ సుధీర్,ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ... వివిధ విభాగాల వైద్య నిపుణుల సమన్వయంతో సంక్లిష్టమైన కేసులకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్...

పోలీసుల తనిఖీల్లో 64 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్
డిఎస్‌పి ప్రసన్నకుమార్



ప్రజాపక్షం/అర్వపల్లి: నేరాల నియంత్రణ అసాంఘిక కార్యకలాపాలు నివారణ ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడం. శాంతి భద్రతల పర్యవేక్షణ లక్ష్యం ముఖ్యమని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ అన్నారు. జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అదేశాలతో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 60 మంది పోలీస్ సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. సరైన దృవపత్రాలు లేని 64 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్, కారు కలిపి 68 వాహనాలను స్వాదీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగారం నాగేశ్వరరావు, అర్వపల్లి ఎస్ఐ పి.మధు వెంకట్‌రెడ్డి, చిరంజీవి, క్రాంతి కుమార్, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం జరగాలి

: ఎస్‌పి శరత్ చంద్ర పవార్



ప్రజాపక్షం/హాలియా :అన్యాయానికి గురైన బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.శుక్రవారం హాలియా పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.రికార్డుల నిర్వహణ,ఫిర్యాదులపై పోలీసుల స్పందన తీరును పరిశీలించారు.ఎన్నో ఇబ్బందులు ఎదురైతేనే ప్రజలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తారని, అలాంటి వారికి న్యాయం చేసేలా పోలీస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు సరైన న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. హాలియా పోలీస్ స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయన వెంట మిర్యాలగూడ ఇన్‌చార్జ్ డీఎస్‌పి రవి, హాలియా సీఐ రాఘవ రావు, ఎస్ఐ సాయి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



రూ.10 వేల ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో ఎం.ఏ తెలుగు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గద్దపాటి నవ్యకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ డైమండ్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ ఏడాది ఆగస్టులో నవ్య తల్లి అనారోగ్యంతో ఆకస్మికంగా మరణించడంతో ఆమె తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హాస్టల్ వసతి కోసం చెల్లించాల్సిన రూ.8 వేలు కూడా చెల్లించలేక నెల రోజులకు పైగా కళాశాలకు దూరమైంది.విషయం తెలుసుకున్న తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ సి. అనితా కుమారి, లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించి సహాయం కోరారు. దీనికి స్పందించిన క్లబ్ సభ్యులు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ చేతుల మీదుగా సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫసర్ కె.అంజిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు ఎదుల్ల అంజిరెడ్డి,మేడ మోహన్ రెడ్డి,మైల అశోక్ రెడ్డి,పాల్వాయి రాంరెడ్డి,సామా సంజీవరెడ్డి,నన్నూరు నాగిరెడ్డి,అధ్యాపకులు డాక్టర్ వై.ప్రశాంతి, డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి,ప్రొఫసర్ రఘురాం పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/త్రిపురారం : పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులు చదువుతో పాటు నిత్యం క్రీడల్లో పాల్గొనాలని మిర్యాలగూడ డీఎస్‌పి జి.రవి అన్నారు.శుక్రవారం మండలంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో 70వ స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఖోఖో పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డీఎస్‌పికి విద్యార్థులు పూలు జల్లుతూ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వసరులు ఉన్నా లేకపోయినా విద్యార్థుల క్రీడల్లో పాల్గొనాలన్నారు. అనంతరం పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రవి నాయక్, ఎస్ఐ నరేష్, సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ, ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి,నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఆదర్శ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు దామోదర్,నలీం,పీఈటీలు కొండల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాపక్షం/మునుగోడు : సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు అన్నారు.అమరవీరుల సంస్మరణ దినోత్సవం,పోలీస్ ఫ్లాగ్ డే 2026 సందర్భంగా శుక్రవారం మునుగోడు మండల విద్యా వనరుల కేంద్రంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు,వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





నూతన వస్త్ర బహుకరణ

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ : వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీచిన్న జీయర్ స్వామి వారి పుట్టినరోజులు పురస్కరించుకుని ప్రతి సంవత్సరం దీపావళి పండుగకు పేదల ముఖాలపై చిరునవ్వు చిందించే కార్యక్రమం నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమంను నిర్వహిస్తున్న వికాస తరంగిణి కార్యకర్తలను ముఖ్య అతిథులుగా పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్యాది లు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మందికి పైగా వృద్దులకు, పేదలకు నూతన వస్త్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి గాయత్రి, మొరిశెట్టి శ్రీనివాస్, నల్లూన్ చక్రవర్తుల వేణుగోపాల చార్యులు, మురళిధరచార్యులు, వికాస తరంగిణి కార్యక ర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వాదం



ప్రజాపక్షం/చింతపల్లి : మండల పరిధిలోని తీదేడు గ్రామానికి చెందిన మర్రు శ్రీనివాస్‌రావు మనుమరాలు, శివాని, శ్రావణ్‌కుమార్ రావు దంపతుల కుమార్తె చిన్నారి ఈష్ణవి మొదటి పుట్టిన రోజు శుక్రవారం ఘనంగా జరి గాయి. ఈ వేడుకలకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ హాజరయి చిన్నారికి శుభాకాం క్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యా సాగర్‌రావ్, వల్లభ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ,ఫ్లోరైడ్ పరీక్షలు

ప్రజాపక్షం/మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో బోర్లు, చేతిపంపులు,మిషన్ భగీరథ నీటి సరఫ రాకు చెందిన నీటి నమూనాలను మండల అధికారులు శుక్రవారం సేకరించారు. సేకరించిన నమూనాలను ఫ్లోరైడ్ పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో నీటి నాణ్యతను పరిశీలించేందుకు ఈ సేకరణ చేప ట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ లపంగి నరసింహ మాట్లా డుతూ గ్రామ ప్రజల ఆరోగ్యమే తమ ప్రాధాన్యమని, సుర క్షిత తాగునీటి సరఫరా కోసం గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీరా,వార్డు సభ్యులు భీమనగోని యాదయ్య,పగిళ్ల శంకర్,మాజీ సర్పంచ్ నక్క వెంక టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది



ప్రజాపక్షం/డిండి; గ్రామీణ ప్రాంతాల అభివృ ద్ధికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి మండలంలోని పెద్ద తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రారంభించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జిమ్, హైమాస్ట్ లైట్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. తండాలో నూత నంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్ర వేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం చెర్కుపల్లి గేటు వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను, చెరుకుపల్లి రైతు వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేప డుతున్నట్లు ఎంఎల్‌ఏ తెలిపారు. ఈకార్యక్ర మంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, మండల అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పెద్దతండా సర్పంచ్ కాట్రావత్ చిట్టిమ్మ శంకర్, చెరుకుపల్లి సర్పంచ్ రామచంద్రయ్య, సిపిఐ మండల సహాయ కార్యద ర్శులు శైలేష్ పాల్గొన్నారు.

బిసిలు రాజ్యాధికారం దిశగా పోరాడాలి



ప్రజాపక్షం/మునగాల: బిసిలు రాజ్యాధికారం దిశగా పోరాడాలని జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ పిలుపుని చ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని నల్ల పాటి నాగేశ్వరరావు రైస్‌మిల్లులో జరిగిన జాతీయ బిసి చైతన్య సమితి రాష్ట్రమహిళ ఉపాధ్య క్షురాలు నాగార్జునపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరి గిన సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ జనాభాలో 50శాతం పైగా ఉన్న బిసిలకు చట్టసభలలో విద్యా ఉద్యోగ, అర్థిక రాజకీయ రంగాలలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అదే విధంగా 2027 జరిగే దేశవ్యాప్త జనాభా గణనలో ఓబిసి లకు గణనా జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిల సమగ్ర అభివృద్ధి కోసం బిపి మండల్ సిపార్సులు అమలు చేయాలని దశాబ్దాల కాలం నుండి పరి ష్కారం కాని బిసి డిమాండ్లపై బిసిలలో నాయక త్వాన్ని పెంపొందించేందుకు విద్యార్థి, యువజన మహిళ గ్రామ గ్రామన కమిటిలు వేస్తూ బిసి ఉద్యమ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు నాగార్జునపు రాజ్యలక్ష్మి, సుంకరి నాగయ్య, చెన్నోజు ధన లక్ష్మి, సురోజు జ్యోతి, భోజనపల్లి గోవిందమ్మ, గుగ్గిళ్ల సతీష్‌చారి, కంబాల ధనలక్ష్మి, బెజ్జంకి చంద్రకళ, ఉపాధ్యక్షురాలు రాజరికం కళావతి, మారోజు ఈశ్వరమ్మ, సింగోజు శ్రీనివాసచారి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల గ్రాడ్యు యేట్ ఓటర్ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు ఎప్పటికప్పుడు ఉద్యమానికి న్యాయ సల హాలు అందిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకె ళ్లిన ఘనత న్యాయవాదులదేనన్నారు. ఎంతో మంది ఉద్యమకారులకు ఉచితంగా న్యాయ సహాయం అందించారని గుర్తు చేశారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, తమ కుటుంబ సభ్యులు,స్నేహితులను కూడా నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్,కార్య దర్శి అశోక్, సీనియర్ న్యాయవాదులు గుండె వెంకటేశ్వర్లు, మునగాల నారాయణరావు,జి.జవ హర్,సిరిగిరి వెంకట్ రెడ్డి,లోడంగి గోవర్ధన్, కంచ నపల్లి రవీందర్ రావు,యడవెల్లి సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి,న్యాయవాదులు యాదగిరి, ప్రవీణ్ కుమార్,వెంకట్ రెడ్డి,మంద నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే జననం



ప్రజాపక్షం/నందికొండ :పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణికి మార్గమధ్యంలోనే ప్రసవం కాగా,108 సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహ రించి సురక్షితంగా తల్లీబిడ్డ ప్రాణాలను కాపా డారు.ఈ ఘటన తిరుమలగిరి మండలం అనం తారం (అల్వాల ఎక్స్‌రోడ్) వద్ద చోటుచేసు కుంది.అల్వాల గ్రామానికి చెందిన ఉప్పునూరి గంగకు శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమా చారం అందించారు.వెంటనే స్పందించిన కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి, నాగార్జునసాగర్‌కు చెందిన 108 సిబ్బంది ఈఎంటీ గోవర్ధన్, పైలట్ శంకర్ గ్రామానికి చేరుకుని గంగను అంబులె న్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా,అల్వాల ఎక్స్ రోడ్ వద్ద నొప్పులు తీవ్రం కావడంతో ప్రసవం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈఎంటీ గోవ ర్ధన్,పైలట్ శంకర్ ఈఆర్‌సీపీ వైద్యుల సూచనల మేరకు అంబులెన్స్‌లోనే ప్రసవం చేయగా, గంగ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.అత్యవసర పరిస్థితుల్లో ఏమాత్రం ఆందోళన చెందకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి సుఖ ప్రసవా నికి సహకరించిన 108 సిబ్బంది గోవర్ధన్, శంక ర్‌లను వైద్యులు,108 ఉన్నతాధికారులు,గ్రామ స్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాపక్షం/కోదాడ: పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూ ల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఉపా ధ్యక్షులు గట్ల నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యా ర్థులు ఫోక్సో చట్టం 2012పై అవగాహన కలిగి ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను గుర్తించి అప్రమత్తంగా మెలగాలని సూచిం చారు. రాజ్యాంగంలోని ప్రాథమిక విధులు, చట్టాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. గట్ల నర్సింహారావు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జగన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాదులు సీతరామరాజు, కన్నన్ సాబ్, పెద్దబాబు, నవీన్‌కుమార్, సామ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

యడవెల్లి అఖిల్‌రెడ్డి సహకారంతో సిసి కెమెరాల ఏర్పాటు



ప్రజాపక్షం/పెన్‌పహాడ్: గ్రామ ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, అవాంచనీయ సంఘటనలను అరికట్టేందుకు పొట్లప హాడ్‌లో గ్రామ పంచాయతీ సరికొత్త అడుగు వేసింది. గ్రామ ప్రజల రక్షణే ధ్యేయంగా యడవెల్లి అఖిల్‌రెడ్డి అందించిన ప్రత్యేక అర్థిక సహకారంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో అత్యాధునిక సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నిఘా నేత్రాల వ్యవస్థను గ్రామ సర్పంచ్ మేకపోతుల చిన్న లింగయ్య, ఉప సర్పంచ్ గంగా రపు సురేష్, కానిస్టేబుల్ భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిం చారు. సిసి కెమెరాల ఏర్పాటుకు పూర్తి మద్దతు ఇచ్చిన దాత అఖిల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవంబర్ 01న ఛలో ఢిల్లీ

ప్రజాపక్షం/డిండి; నవంబర్ 01న ఢిల్లీ రాంలీల మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ డిండి మండల అధ్యక్షులు గడ్డమీది సాయి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ సభలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్ర మాలు జరిగాయనే ఆరోపణలు, ఎన్నికల సంఘం జవాబుదారీ తనం, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా తదితర అంశాలపై ప్రస్తావించనున్నారని అన్నారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు ప్రజా స్వామ్య విలువలు, ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన కల్పించా ల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభ విజయవం తానికి యువజన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో సులభం

ప్రజాపక్షం/నాంపల్లి : మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో గురువారం రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోరె దేవేందర్ సైదులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపె ట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల లబ్ధిదారులకు రేషన్ సేవలు మరింత సులభతరం అవుతాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు కార్డు లను పంపిణీ చేశారు. వార్డు సభ్యులు గోపిశెట్టి రాము,బుషిపాక లక్ష్మయ్య,సిరియాల వెంకట్రాములు పాల్గొన్నారు.





చెరుకుపల్లి హైస్కూల్ అభివృద్ధికి సహకరించండి

ప్రజాపక్షం/డిండి; గుండ్లపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని శుక్రవారం చెరుకుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ గోప్యానాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఎల్‌ఏ బాలునాయక్‌కు పాఠశాలకు కావాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాల సమస్యలపై ఎంఎల్‌ఏ సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ గోప్యానాయక్‌తో పాటు ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, వేణు, లింగయ్య, శ్రీనివాస్, సర్దార్‌సింగ్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన



ప్రజాపక్షం/డిండి; మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డిండి మండల కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మధ్నాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిజిటి ఉపాధ్యాయులందరికి నేషనల్ ఇంక్రిమెంట్స్ వర్తింప జేయాలని, ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి 010పద్దు ప్రకారం జీతాలు ఇవ్వాలని, జీవో నెం 317 అమలు చేసి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనిరసన కార్యక్రమంలో పాఠశాల, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. శ్యాంసుందర్, శ్రీలత, రమా, సుశీల, రామారావు, విజయ్‌కుమార్;, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, సోమయ్య, రవి, విజయ్‌కుమార్, రమేష్, అశ్విని, జ్యోతి, సందీప్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మండలం, గౌరాయిపల్లి గ్రామానికి చెందిన పిట్టల సత్యనారాయణ అనారోగ్యంతో బోడుప్పల్లోని శ్రీకర ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ప్రభుత్వ విప్ శ్రీమతి గొంగిడి సునితా మహేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని, రోగి కోలుకునే వరకు అన్ని విధాలా అండగా ఉండాలని ఆసుపత్రి వైద్యులను ఆమె కోరారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.



ఉపాధ్యాయులను విధుల నుండి తొలగించాలి

ప్రజాపక్షం/దేవరకొండ; విద్యార్థినిల ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఉపాధ్యాయులను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేవరకొండలోని పెంచికల్ పహాడ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బిఆర్ఎస్వి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని ఘటనకు బాధ్యులైన ఉపాధ్యాయులను వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్‌సివో పర్యవేక్షణ లోపం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.



విద్యార్థుల భద్రతను పట్టించుకోకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమని అన్నారు. ఈఘటనపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బిఆర్ఎస్వి నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/నందికొండ : మత్తు పదార్థాలకు అతి ర్షితులై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి సీఎంఓ డాక్టర్ హరికృష్ణ విద్యార్థులకు సూచించారు.శుక్రవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి హిల్‌కాల నీలో మత్తు పదార్థాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్,కమలా నెహ్రూ ఆసుపత్రి వైద్యులు జయంత్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు చింతపల్లి వెంకటయ్య,ప్రసన్నలక్ష్మి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న వరి ధాన్యం..

నష్టపోతున్న రైతన్న

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి మండల వ్యాప్తంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా కొనుగోళ్ల ఆలస్యంతో ఎటు తేల్చుకోలేక పడిగాపులు కాస్తూ కిరాయిల భారం మోయలేక వరి ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని పోచంపల్లి మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు వెంటనే ప్రారంభించక పోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన భారీ ఎత్తున నిరసనలు ధర్నాలు చేపడతారని తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్పటికీ నేటికి ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు తీవ్రమైన ఎండలతో



ధాన్యం తూకం తక్కువ వస్తుందని భయం మరోవైపు అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో నష్టం వచ్చినా సరే ధాన్యం అమ్ముకునేందుకు ప్రైవేట్ రైస్ మిల్లుల వైపు మొగ్గు చూపుతున్నారని వాపోయారు. ఎమ్మెల్యే వ్యవసాయ సహకార సంఘ నేతలు అధికారులు కొనుగోలు వెంటనే ప్రారంభిస్తామని రైతులకు చెప్పి ప్రారంభించకుండా మోసం చేస్తున్నారని ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

న్యాయ అవగాహన సదస్సు



ప్రజాపక్షం/రామన్నపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆదేశాల మేరకు, రామన్నపేట మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజ్, జనంపల్లి గ్రామం ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సురక్ష బచ్పన్ అభియాన్‌బాలల హక్కులు మరియు పోక్సో చట్టం2012 అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్. శిరీష ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న ప్పటి నుంచే తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపద సమయంలో సహాయం కోసం చైల్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 112, న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కునూరు శ్రీనివాస్ ప్యానెల్ అడ్వకేట్, కె.శ్రీశైలం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు, కె.యాదయ్య రామన్నపేట పారా లీగల్ వాలంటీర్, పాఠశాల ప్రిన్సిపల్ కె.నాగమణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జె.కృష్ణవేణి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు



ప్రజాపక్షం/నల్లగొండ :ఈ నెల 31న ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎఐటియుసి కీలక పాత్ర పోషించిందని,ఘనమైన చరిత్ర కలిగిన ఎఐటియుసికి లాలా లజపతిరాయ్, జవహర్ లాల్ నెహ్రూ,వీవీ గిరి,సుభాష్ చంద్రబోస్, సరోజినీ నాయుడు,భగత్ సింగ్,డాంగే, ఇంద్రజిత్ గుప్తా, బర్ధన్, గురుదాస్ దాస్ గుప్తా వంటి గొప్ప నాయకులు నాయకత్వం వహించారని అన్నారు.మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి హక్కులు లేకుండా చేసిందని,యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మార్చిందని ఆరోపించారు. దేశంలో ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని,నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు, కనీస వేతనాల అమలు,ఉద్యోగ భద్రత కోసం రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 6న పిజి కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో 2026/27 విద్యా సంవత్సరానికి గాను ఆరు పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి నవంబర్ 6న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ తెలిపారు.టీజీ సీపీజెట్2026 కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన ఖాళీ సీట్లను ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు.ఎంఏ తెలుగు, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ జువాలజీ లాంటి కోర్సులు ఉన్నావిటీజీ సీపీజెట్ 2026లో అర్హత సాధించిన వారితో పాటు,అర్హత సాధించని వారు, పరీక్ష రాయని వారు కూడా హాజరు కావచ్చని పేర్కొన్నారు. అయితే సంబంధిత కోర్సుకు సీపీజెట్ నోటిఫికేషన్‌లో సూచించిన అర్హతలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్,ఉపకార వేతనాలు కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన సీపీజెట్2026 అర్హులైన విద్యార్థులకు మాత్రమే వర్తిస్తాయని,స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరే విద్యార్థులు కోర్సు ఫీజును స్వయంగా చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రవేశ సమయంలో రూ. 2,100 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి,అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు,రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా హాజరు కావాలని సూచించారు.

నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: మంగలి వృత్తిని నిర్వహిస్తు ఆర్థికంగా దీనావస్థలోనున్న నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం భువనగిరి పట్టణ అధ్యక్షులు పత్తేపురం మహేందర్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. భువనగిరి పట్టణంలో శుక్రవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేసి మంగలి వృత్తి నిర్వహిస్తు ఆర్థికంగా చితికిపోయి జీవనం కొనసాగిస్తున్న వారి అభివృద్ధికి కార్పోరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు 50సంవత్సరాల పయస్సునిండిన నాయి బ్రాహ్మణులకు 5వేల రూపాయల పెన్షన్ మంజూరిచేయలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో కానుగంటి ప్రేమ్‌కుమార్, కంతేశ్వరం విశాల్, వేముల సత్యనారాయణ, రాచమళ్ల మురళి, కొల్తూరి వేణు, మోహన్, సతీష్, రాము, పరమేశ్, రాజు, అంజనేయులు, మనోజ్, గణేష్, రామకృష్ణ, వెంకటేష్, మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





కార్మికుడికి నివాళులు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్‌లో కట్టెల భిక్షం భవన కార్మికుడు మృతి చెందడంతో ఆయన పార్థివ దేహంపై ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి దుబ్బాక సంజీవ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భిక్షం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు పూలమోనీ శంకర్, ఏఐటీయూసీ నాయకులు సుక్క నర్సింహా, యాదయ్య లింగస్వామి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

దివిస్ పరిశ్రమ సహకారం అభినందనీయం



ప్రజాపక్షం/చౌటుప్పల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దివిస్ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆరెగూడెం గ్రామ ఉపసర్పంచ్ నిమ్మల సత్యనారాయణ అన్నారు.మండలంలోని ఆరెగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దివిస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా 340 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అదేవిధంగా ఉచితంగా నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎన్నపల్లి వెంకట్‌రెడ్డి,ప్రధానోపాధ్యాయులు వెణుగోపాల్,లింగస్వామి, పాఠశాల చైర్మన్ అఖిల,డాక్టర్లు నరేష్,సౌజన్య, దివిస్ ప్రతినిధులు గోపి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా నాతి రాజు

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): మండల కేంద్రంలోని మదర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ గా నాతి రాజు,డైరెక్టర్లుగా బూడిది మల్లయ్య,పంజాల వెంకన్న, కోల రాములు,యాస వెంకట్ రెడ్డి,యాస శ్రీనివాస్ రెడ్డి, రంగ శీను,బాసాని రాములు,పోతుగంటి ఉప్పలయ్య, కొలెపాక నరసింహ ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్,ఉప సర్పంచ్,మజ్జిగ నరేష్,పిఏసిఎస్ డైరెక్టర్ పోతగాని మల్లేశం గౌడ్,మాజీ సర్పంచ్ లు యాస బుచ్చిరెడ్డి,జెన్నాయికోడె నగేష్,పాల సంఘం సెక్రెటరీ పంజాల నరసయ్య,అఖిలపక్ష నాయకులు యాస ఇంద్రారెడ్డి,కోరే బిక్షపతి,బొబ్బల ఇంద్రారెడ్డి,మజ్జిగ నరసయ్య పాల్గొన్నారు.



ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

ప్రజాపక్షం/బీబీనగర్: ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎలాంటి అధైర్య పడవద్దని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమడుగు, రాఘవపూర్, బ్రహ్మణపల్లి గ్రామాల్లో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్



చైర్మన్ పొట్టోళ్ళ శ్యామ్ గౌడ్,మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, స్థానిక సర్పంచ్, సీనియర్ నాయకులు గడ్డం బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రాతి ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపలి: పోచంపల్లి పట్టణంలోని ప్రముఖ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం వేదమంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. జెసిబి సహాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే విధంగా ధ్వజస్తంభ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు ఆనందపరశులయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవ కుమార్ పోచంపల్లి పిఏసిఎస్ చైర్మన్ పాక మలేష్ యాదవ్ దేవాలయ చైర్మన్ సీత సత్య నారాయణ ఉపాధ్యక్షులు భారత ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి కోశాధికారి గుర్రం కృష్ణ ధర్మకర్తలు వెంకటేశం కృష్ణ చంద్ర



మౌళి రామచంద్రం నాగేష్ పాండు బాలమణి జయలక్ష్మి పద్మావతి శిరీష పాండురంగ స్వామి మాజీ అధ్యక్ష కార్యదర్శులు చక్రాల నరసింహ పుప్పాల నాగేశ్వర్ వివిధ భజన సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి మండలంలోని చందుపట్ల సంఘం చైర్మన్ జీలుగు సతీష్ పవన్ ఆధ్వర్యంలో సంఘం పరిధిలోని 6 వరి ధాన్యం కొనుగోలు కేంద్రము(పిపిసి)లను చీమల కొండూరు, వీరవెల్లి, బండసోమారం, ఎర్రంబెల్లి, రామచంద్రపురం, చందుపట్ల గ్రామాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఎవరూ దళారులను నమ్మి వడ్లు అమ్మి మోసపోవద్దు అని ఎలాంటి అవినీతికి తావు లేకుండా రైతుల పక్షాన ఈ కమిటీ ఉంటుందని, మీకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా మీకు ఎల్లప్పుడూ అందుబాటులో మా కమిటీ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చిన్నం ఉప్పలయ్య, పర్సన్స్(డైరెక్టర్లు) మాటూరి నవనీత, దంతూరు సత్తయ్య భక్తమ్మ, సుర్పు కృష్ణ, సిలువేరు నరేష్ పాక వెంకటేష్, నల్లమసు శివరాజ్, వడ్డే నరేష్ చందుపట్ల గ్రామ సర్పంచ్ లలిత, చీమల కొండూరు గ్రామ సర్పంచ్ అంజయ, ముస్త్యలపల్లి గ్రామ సర్పంచ్ హేమలత, మార్కెట్ కమిటి చైర్మన్ కనుకుంట్ల రేఖబాబురావు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులకు సాంకేతిక చిక్కులు!

ఇ పాస్ వెబ్‌సైట్ ఓపెన్ కాక విద్యార్థుల అవస్థలు
నేటితో ముగియనున్న గడువు, ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాపక్షం/చిట్యాల: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తొలిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మొదటి సారి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ వేలిముద్ర (బయోమెట్రిక్) ద్వారా ప్రాథమిక నమోదు ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను మీ సేవ కేంద్రాల ద్వారానే పూర్తి చేయాల్సి ఉంది. అనంతరం ఈ పాస్(ఈపాస్) వెబ్‌సైట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. అయితే కొద్ది రోజులుగా మీ సేవ కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులకు ఈ పాస్ సంబంధించిన వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగడం లేదని మీ సేవ కేంద్రాల సిబ్బంది వివరిస్తున్నారు. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన విద్యార్థులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

మరోవైపు దరఖాస్తు సమర్పణ ఈ నెల 31వ తేది (ఈ రోజు)ని చివరి రోజు గడువుగా నిర్ణయించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. వేల సంఖ్యలో విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, వెబ్ సైట్ అందుబాటులో లేకపోవడంతో గడువులోగా దరఖాస్తు చేసుకోగలమా లేదా అన్న సందేహం వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం ఒక వైపు పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తుండగా, మరోవైపు సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది.



సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ పాస్ వెబ్ సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు ప్రక్రియ సజావుగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే విధంగా వెబ్ సైట్ సమస్యల కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గడువును పొడిగించాలని ప్రభుత్వాన్ని విజప్తి చేస్తున్నారు.

జాతీయ ఐక్యత కోసం... ఐక్యత పరుగు కార్యక్రమం

ప్రజాపక్షం/నూర్యాపేటటౌన్: నేడు 31వ తేదీ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఆరు గంటలకు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా నుండి మినీ ట్యాంక్ బండ్ వరకు జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఐక్యత కోసం పరుగు రన్ ఫర్ యూనిటి కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి కె.నర్సింహా తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రన్‌ఫర్ యూనిటి కార్యక్రమం సంబంధిత పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కావున పౌరులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జాతి ఐక్యమత్యం చాటాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకోవడంతో పాటు, దేశియ ఐక్యతను అంకితభావాన్ని వ్యక్తపర్చే అవకాశం కలుగుతుంది. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో శుక్రవారం శ్రీ ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ అర్చకులు పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఈ విశేష ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపు: సాయంత్రం వేళ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ద్రవిడ ప్రబంధ పారాయణాలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఊరేగింపుగా విచ్చేసిన అమ్మవారికి మహిళా భక్తులు నీరాజనాలు పలికి, మంగళహారతులతో విశేష స్వాగతం పలికారు.

అద్దాల మండపంలో ఊంజల్ సేవ: అనంతరం ప్రధాన ఆలయంలోని అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి అత్యంత భక్తి శ్రద్ధలతో ఊంజల్ సేవ (ఉయ్యాల సేవ) జరిపించారు.

దంచి కొట్టిన వాన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణ మండల పరిసర ప్రాంతాలలో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో వాన దంచి కొట్టింది. మెరుపులు తీవ్ర స్థాయిలో మెరుస్తుండడంతో ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎల్ నినో ప్రభావంతో ఎండలతో సతమతమవుతున్న ప్రజలు తాజాగా కురిసిన వారితో ఉపశమనం పొందారు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మేఘావృతంగా మారిపోయి ఎలాంటి గాలి లేకుండా ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జల మయమయ్యాయి. కాగా అకస్మాత్తుగా అనుకోని వర్షం పడటంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడరాని పాట్లు.